ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మార్కింగ్ ఇవ్వాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



వెండింగ్ జోన్ ఏర్పాటుకు సంబంధించిన మార్కింగ్‌ను పరిశీలిస్తున్న పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో డ్రైయిన్, రోడ్ల ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఏర్పాటు చేయకుండా మార్కింగ్ ఇవ్వాలని, పూడికతీత పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కొరిటిపాడు సెంటర్ నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు జీఎంసీ చేపట్టిన డ్రెయిన్, రోడ్ల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ, గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజీ దగ్గర వెండింగ్ జోన్ ఏర్పాటు మార్కింగ్‌లను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలోని డ్రెయిన్లలో పూడికను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అనంతరం గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజి రోడ్‌లో ప్రతిపాదించిన వెండింగ్ జోన్‌కు మార్కింగ్‌ని పరిశీలించి, ట్రాఫిక్‌కి అవరోధం కాకుండా, బండ్లు రోడ్ల మీదకు రాకుండా ఉండేలా మార్కింగ్ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్‌ఎస్ సోమశేఖర్, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు

ఎన్‌పీసీఐ సర్వే, జియో ట్యాగింగ్ పర్యవేక్షణ లోపంపై 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా జరుగుతున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) సర్వే, ఇళ్ల జియో ట్యాగింగ్ వేగవంతంపై మౌఖికంగాను, టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించినా ఆశించిన స్థాయిలో ఆయా నోడల్ అధికారుల పరిధిలో సర్వే వేగవంతం కాలేదన్నారు. దీనికి బాధ్యులైన 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

త్వరలో సిటిజన్ రివార్డులు

నగర అభివృద్ధిలో భాగస్వాములు అయ్యే వారికి ప్రత్యేక యాప్ ద్వారా సిటిజన్ రివార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ సంస్థ ప్రతినిధి సమీర్ గౌతమ్ సిటిజన్ రివార్డ్స్, అమలు, ప్రజలు వినియోగించుకునే తీరుని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ వంతుగా స్వచ్ఛ గుంటూరులో, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావడానికి జీఎంసీ నుంచి ప్రోత్సాహకంగా సిటిజన్ రివార్డ్స్‌ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా సమీర్ గౌతమ్ మంగళవారం వివరాలను విభాగాధిపతులకు వివరించారని, త్వరలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నగర ప్రజలు తాము చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించడం, వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారానే ప్రత్యేక యాప్ ద్వారా అందించే క్యూఆర్ కోడ్ ద్వారా రివార్డ్స్ అందేలా జీఎంసీ చేపడుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి పచ్చదనం..

గుంటూరు నగరానికి వచ్చే ప్రధాన ప్రవేశ మార్గాల్లో పచ్చదనంతో కూడిన లాన్‌లు, డివైడర్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఆటో నగర్ రోడ్డు, వై జంక్షన్ ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పన్ను చెల్లించకుంటే ట్యాప్ కనెక్షన్ తొలగింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివాసాలకు తొలుత ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు బృందావన్ గార్డెన్స్‌లో గంటా పున్నయ్య చౌదరి, చిలకలూరిపేట రోడ్డులోని కొత్త కాలనీలో అనధికారికంగా ట్యాప్ కనెక్షన్ పొందిన నందిగామ కోటయ్య నివాసాలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్‌ని ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి జీఎంసీ నుంచి అందించే మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రెయినేజీ కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

సృజనాత్మక బోధన అవసరం




గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే బోధన అవసరమని గుంటూరు తూర్పు ఎంఈఓ–1 అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న శ్రీమహాకవి తిక్కన– పులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని, విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలోని బోధన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుని, విద్యార్థి కేంద్రంగా విద్యాబోధన కొనసాగించాలని అన్నారు. ఉపాధ్యాయులు అనుసరించే బోధన విధానాలు విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉండాలని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వసుంధర పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల పెంపుదల తగదు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అశాస్త్రీయమైన పని వేళలను విరమించుకుని, ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.45 గంటలుగా మార్పు చేయాలని కోరారు. ఇప్పటికే అనేక రకాల యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్న పరిస్థితుల్లో పనివేళల మార్పుతో మరింతగా భారం పడనుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నూతన టైం టేబుల్‌ను విరమించుకుని, ప్రస్తుతం అమల్లో ఉన్న టైం టేబుల్‌నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అగస్త్యేశ్వరునికి అన్నాభిషేకం



పట్నంబజారు: కార్తిక మాసం పురస్కరించుకుని పాతగుంటూరులోని శ్రీగంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయంలో అన్నాభిషేకాన్ని రెండోసారి ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫణిశర్మ, శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నాభిషేకం అనంతరం స్వామివారి రూపంతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కూటమి ఎన్నికల హామీలు నెరవేర్చాలి



లక్ష్మీపురం: కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక 41వ డివిజన్ రాజీవ్ గృహకల్పలో మంగళవారం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లతో పాటు ఇసుక ఇటుక, కంకర రేట్లు పెరిగిన కారణంగా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. గుంటూరు నగరంలోని అన్ని డివిజన్‌లలో అప్లికేషన్లు పూర్తి చేసి ఈనెల 18 నుంచి అన్ని సచివాలయాల్లో అందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకొని డిమాండ్ చేశారు. అలాగే 48వ డివిజన్ రెడ్డిపాలెం చెరువు గట్టు మీద ఉన్న అందరికీ సీపీఐ ఆధ్వర్యంలో అప్లికేషన్ పూర్తి చేసి సరస్వతి నగర్ ని సచివాలయం వద్ద సచివాలయ కార్యదర్శికి అందజేయడం జరిగిందన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

గుంటూరు మెడికల్: బోయపాటి వెంకట సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా బీవీఎస్ ఫౌండేషన్ చైర్మన్ బోయపాటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో రోడ్డు పక్కన నివసిస్తున్న 100 మంది పేదలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గుంటూరు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు బోయపాటి వెంకట శివా షర్విన్, ట్రస్ట్ సెక్రెటరీ బోయపాటి అరుంధతి, ఎస్.ఎన్.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

కవి సుభానికి సత్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభానిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, నిర్వాహకులు బి.శకుంతల, పి.శిరీష, సుధాకర్, కోటేశ్వరి, కవయిత్రులు షేక్.కాశింబీ, తాటికొల పద్మావతి, యక్కంటి పద్మావతి, పింగళి భాగ్యలక్ష్మి, కవులు కొణతం నాగేశ్వరరావు, దారివేముల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

దళిత మహిళను మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి చెందిన దళిత మహిళ డి.శిరీషాను మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాడీపేటకు చెందిన శిరిషా మామ కొమ్ములపాటి నరసయ్య బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చిన సొమ్ముతో ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో రుణం తీసుకుని సిటీ బస్సు కొనుగోలు చేశారని... తమ వద్ద నమ్మకంగా ఉన్న డ్రైవర్ అబ్దుల్ రహీం పేరుతో బస్సును రిజిస్ట్రేషన్ చేయించి ప్రతి నెల నరసయ్య ఎస్‌బీఐ బ్యాంక్‌కు వాయిదాలు చెల్లించాడని చెప్పారు.

వాయిదాలు పూర్తి కావడంతో తన పేరుకు మార్చాలని డ్రైవర్ రహీంను కోరగా బస్సు నా పేరుతో ఉందని, మీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేదని ఎదురు తిరిగినట్లు చెప్పారు. దీనిపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. మధ్యవర్తిగా ఓ పత్రికలో పనిచేసే వ్యక్తి(సాక్షి కాదు) మీ బస్సును మీకు ఇప్పిస్తామంటూ నమ్మబలికి బస్సును కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఇటీవల బస్సును అప్పగించాలని శిరీషాపై కులం పేరుతో దూషించడంతో అరండల్‌పేట స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. పోలీసులు సదరు బస్సును స్టేషన్‌కు తరలించారని...కాని బస్సు ఇప్పుడు స్టేషన్‌లో లేదని ఆరోపించారు. బస్సును శిరిషాకు అప్పగించకుంటే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో డెప్యూటీ సీఎం, హోంమంత్రి, డీజీపీ స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రసాద్, కృష్ణా, నరేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే 108 వాహనాలు నిర్వహించాలి



నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

గుంటూరు మెడికల్: ప్రభుత్వమే 108 వాహనాలను నిర్వహించాలని కోరుతూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా 108 వాహనాల సిబ్బంది తమ వాహనాలపై స్టిక్కర్లు అంటించారు. కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనలో భాగంగా 15వ రోజు మంగళవారం స్టిక్కర్లు అంటించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్ మాట్లాడుతూ 108 అంబులెన్సు వాహనాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. తద్వారా ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం వాహన నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అరబిందో యాజమాన్యం బెదిరింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తాము బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్‌లలో భాగంగా వేతనాలలో స్లాబ్ విధానం తీసివేయాలని, వేతనాలను పెంచాలని కోరారు. ఈనెల 11వ తేదీ నుంచి చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 25వ తేదీ వరకు తాము వేచి చూస్తామని, డిమాండ్‌లకు యాజమాన్యం స్పందించని పక్షంలో 26 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంజుల, శివప్రసాద్, హేమంత్, షేక్ బాబు, జే.వీ.ఎస్. రామకృష్ణ, సుమన్ పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యం, యోగతో ఆరోగ్యానికి మేలు



డాక్టర్ భ్రమరాంబ సమీర, లిఖితను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకృతి వైద్యం, యోగ అనేవి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకునే సహజ సిద్ధమైన పద్ధతులని కేర్ యోగ–నేచురోపతి వైద్య కళాశాల, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ భ్రమరాంబ సమీర పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం నేచురోపతిపై అవగాహన, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ భ్రమరాంబ సమీర మాట్లాడుతూ మానవ శరీరంలో సహజ సిద్ధమైన రక్షణ శక్తులను పెంపొందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు, చికిత్సా విధానాలకు నేచురోపతి, యోగా పద్ధతులు అత్యంత ప్రధానమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ రెండింటినీ అనుసంధానం చేయడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని సాధించడంతో పాటు సుస్థిరమైన జీవితాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి యోగా విభాగ డాక్టర్ లిఖిత యోగాతో కలిగే ఉపయోగాలు, ఆచరించే విధానాన్ని గురించి శాస్త్రీయమైన పద్ధతిలో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు నేచురోపతి, యోగాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, ఎస్.మణికంఠ పాల్గొన్నారు.

25న వినికిడి యంత్రాల పంపిణీ శిబిరం

నెహ్రూనగర్: ఈనెల 25వ తేదీన ఉచిత స్పీచ్ అండ్ హియరింగ్ తనిఖీ శిబిరం నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్(దివ్యాంగ్‌జన్) రీజనల్ సెంటర్ సహకారంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవ జాత శిశువుల నుంచి వృద్ధుల వరకు అర్హత కలిగిన వ్యక్తులకు వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వినికిడి లోపం కలిగిన వారు ఆధార్ కార్డు, మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన అంగవైకల్య ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, గత మూడు సంవత్సరాలలో ఏ వనరుల నుంచి ఈ ప్రయోజనం కోసం సహాయం పొందని వ్యక్తులు, గత సంవత్సర కాలంలో సహాయం పొందని 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు హాజరు కావాలని కోరారు. గుంటూరు గవర్నమెంట్ ఆస్పత్రిలోని సుశృత మీటింగ్ హాల్‌లో జరిగే శిబిరానికి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్ర 5 గంటలలోగా హాజరు కావాలని సూచించారు.

దివంగత ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో సుబ్బరత్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు



ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ప్రజలు హృదయాల్లో కొలువు తీరిన నాయకురాలు దివంగత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అని మాజీ శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి మంగళవారం నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాట చేసిన సమావేశంలో మస్తాన్‌వలి మాట్లాడుతూ దేశ ఖ్యాతిని పెంచి ఉక్కు మనిషిగా పేరు పొందిన ఘనత ఇందిరా గాంధీకే దక్కుతోందని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని వర్గాల వారి అభ్యున్నతి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కులాల మధ్య పోరాటం నడుస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఓటు బ్యాంకులా వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిలో ఇందిరమ్మ కుటుంబం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, జనాలగడ్డ వెంకటరెడ్డి, డాక్టర్ జాన్‌బాబు, ఖలీల్, బిల్లా సునీల్, కట్టా నాని, కరీమ్ పాల్గొని నివాళులర్పించారు.

మహిళలు శక్తివంతులు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ స్ఫూర్తితో విద్యార్థినులు, మహిళలు శక్తివంతులు కావాలని జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారు సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ సమర్థంగా పరిపాలన అందించారని కొనియాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ వాసిరెడ్డి భవానీ, డాక్టర్ ధాత్రికుమారి, విశ్రాంత ఉపాధ్యాయిని ఏవీకే సుజాత పాల్గొని "మాదకద్రవ్యాలు–యువతపై ప్రభావం" అనే అంశంపై విద్యార్థినులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

నగరంపాలెం: ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు.

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం అరండల్‌పేటలోని అమరావతి బుక్ హౌస్‌లో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఆర్ శంకరన్ నిరుపేదల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, సోషల్ యాక్టివిస్ట్ కనకవల్లి వినయ్‌బాబు, సముద్రాల కోటేశ్వరరావు, మాజీ ఏజీపీ రాజారావు సంకూరి, భాషా, గాయకులు బాబురావు, ఎనుబరి చంద్రపాల్, బత్తుల అనిల్ పాల్గొన్నారు.

లక్ష్మీపురం: దివంగత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ఉక్కు మహిళగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జయంతి సభ నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు ఎ.వి.రామారావు, విశ్రాంత జిల్లా అధికారిణి ఎస్.ఎ.జోస్టిన్ పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యంతో సరి

- గర్భిణులు, బాలింతలకూ నవంబరు నెల నూనె లేదు
- కేంద్రాల్లో చిన్నారులకు ఉన్న దానితోనే మధ్యాహ్న భోజనం



అంగన్‌వాడీ చిన్నారులు (ఫైల్)

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ లబ్ధిదారులపై అలసత్వాన్ని ప్రదర్శిస్తుంది. రెండు నెలల కిందట అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సకాలంలో సరఫరా చేయకుండా చిన్నారులను పప్పు భోజనానికి దూరం చేసిన ప్రభుత్వం, ఈ నెల నూనెను సరఫరా చేయకుండా గర్భిణులూ, బాలింతలకు మొండిచేయి చూపింది. దీంతో నూనెలేని పోషకాహార వంటలు ఎలా చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి చోటుచేసుకుంటుంది. కాగా ఇదే పరిస్థితి జిల్లా అంతటా అన్ని అంగన్‌వాడీల్లో కనిపిస్తోంది. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులుగా ఉన్న గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం టేక్ హోం రేషన్ ద్వారా ప్రతి నెలా కందిపప్పు, బియ్యం, ఆయిల్‌తో పాటు పాలు, కోడిగుడ్లు సరఫరా చేస్తుంది. కానీ నవంబరు నెల మొదలై పదిహేను రోజులు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం కేంద్రాలకు నూనెను సరఫరా చేయలేదు. దీంతో వందల మంది గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.


ఇదీ ప్రాజెక్టు లెక్క..

అంగన్‌వాడీ కేంద్రాలు	: 226
గర్భిణులు	: 948
బాలింతలు	: 744
0– 6 నెలల చిన్నారులు	: 763
6 నెలలు–1 సం॥ చిన్నారులు	: 963
1–3 చిన్నారులు	: 4023
3–6 చిన్నారులు	: 4,547

గత నెల నూనెతో..

ఇదిలా ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఈ నెల నూనెను సరఫరా చేయలేదు. దీంతో గత నెల సరఫరా చేసిన నూనెతోనే ఈ నెల కూడా సరిపెడుతున్నారు. కాగా నూనె స్టాకు లేని అంగన్‌వాడీలు పక్క సెంటరు నుంచి అరువు తెచ్చుకోవడమో లేక, బయట కొనుగోలు చేసి చిన్నారులకు వంట చేసి మధ్యాహ్న భోజనం పెట్టడమో చేయాల్సిన పరిస్థితి.

ఈ నెల నూనె సరఫరా లేదు



నవంబరు నెలకు సంబంధించి నూనె సరఫరా ఇంకా చేయలేదు. స్టాక్ రాగానే కేంద్రాలకు సరఫరా చేస్తాం. నూనె మినహా అన్ని రకాల సరుకులను ప్రభుత్వం ఇప్పటికే అందించింది. లబ్ధిదారులకు పంపిణీ చేశాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా గత నెల సరఫరా చేసిన నూనె కొంత ఉంది. దానితో వంట చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

– వి.సుజాతదేవి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు

బాలల చట్టాలపై అవగాహన ఉండాలి



లక్ష్మీపురం: బాలల చట్టాలపై అవగాహన అవసరమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు దుర్గా భవాని అన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్తంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎం.శారదా దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆవశ్యకత, తద్వారా పిల్లల భవిష్యత్ గురించి, బాల కార్మికులు గుర్తించడం, బాల్య వివాహాల నిర్మూలన వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్, క్రాఫ్ట్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కోలా సమీర్ కుమార్, సూపర్‌వైజర్ ఏ. సావిత్రి, ఏ చెల్సియా పాల్గొన్నారు.